
ఆంధ్రజ్యోతి **

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

మంగళవారం 4 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.170	230	260
నల్లగొండ	రూ.152	220	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 24.0



నల్లగొండలోని దుప్పలపల్లిలోని గోదాంలో ఏర్పాట్లు చేసిన అధికారులు

నేడు ఉత్కంఠకు తెర

మండు వేసవిని సైతం లెక్క చేయకుండా ఓటేసిన ప్రజల మనోగతం నేడు బహిర్గతం కానుంది. నరాలు తెగే ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ప్రధాన పార్టీల భవితవ్యం నేటి మధ్యాహ్నానికి తేలిపోనుంది. గత నెల 14వ తేదీన జరిగిన నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఓట్ల లెక్కింపును నేడు చేపట్టనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నల్లగొండ ఓట్ల లెక్కింపును దుప్పలపల్లి సమీపంలోని గోదాంలో, భువనగిరి ఓట్ల లెక్కింపును భువనగిరి శివారులోని అరోరా కళాశాలలో చేపట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే లెక్కింపునకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు.



భువనగిరిలోని అరోరా కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

- భవితవ్యం తేలేది నేడే
- తొలి ఫలితం మిర్యాలగూడదే
- పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- నల్లగొండలో 14 టేబుళ్లు, 24 రౌండ్లలో ఫలితాలు
- ఉదయం 8 నుంచి మొదలవనున్న కౌంటింగ్

నల్లగొండ,జూన్ 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఫలితాల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి 22 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ప్రధాన పోటీ రఘువీర్ కుందూరు (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) మధ్య కొనసాగింది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో మొత్తం 17,25,465 ఓట్లకు, మే 13న జరిగిన పోలింగ్‌లో 74.02శాతం అంటే 12,77,137 ఓట్లు పోలయ్యాయి.

నల్లగొండ పార్లమెంట్	
దేవరకొండ	24
నల్లగొండ	21
నాగార్జునసాగర్	22
హుజూర్‌నగర్	22
కోదాడ	22
సూర్యాపేట	22
మిర్యాలగూడ	19
మొత్తం రౌండ్లు	152

మొత్తం ఓట్లు	17,25,465
పోలైన ఓట్లు	12,77,137
పురుషులు	8,44,843
స్త్రీలు	6,43,450
పోలింగ్ శాతం	74.02
అభ్యర్థులు (బరిలో ఉన్న)	22

తొలుత పోస్టల్ బ్యాలెట్

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్ వద్ద పోస్టల్ బ్యాలెట్లను తొలుత లెక్కిస్తారు. మొత్తం 24 టేబుళ్లపై ఈ బ్యాలెట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ ముగిశాక ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అయిదు పోలింగ్ బూత్‌లకు సంబంధించిన వీవీ ప్యాట్లను లెక్కించి, ఈవీఎం ఓట్లతో పోల్చి పరిశీలిస్తారు. అన్నిరౌండ్ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పూర్తికానుంది.

నల్లగొండ లోక్‌సభ పరిధిలో..

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓట్ల లెక్కింపు 24రౌండ్లుగా చేపడతారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లను కౌంటింగ్‌కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లో ఒక్కో టేబుల్‌పై ఒక్కో ఈవీఎంలో ఓట్లని లెక్కిస్తారు. ఈలెక్కన తక్కువగా 264 పోలింగ్ కేంద్రాలున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపు 19రౌండ్లలో పూర్తయితే, ఎక్కువగా 324 పోలింగ్ కేంద్రాలున్న దేవరకొండ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 24రౌండ్ల వరకు కొనసాగుతుంది. 288 పోలింగ్ స్టేషన్లున్న నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ లెక్కింపు 21రౌండ్లలో కొనసాగనుంది. 306 పోలింగ్ కేంద్రాలున్న నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు 22 రౌండ్లలో, 296 పోలింగ్ స్టేషన్లున్న కోదాడలో 22 రౌండ్లు, 291 పోలింగ్ స్టేషన్లున్న సూర్యాపేటలో 22 రౌండ్లలో లెక్కింపు కొనసాగుతుంది.

144 సెక్షన్ అమలు

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎలాంటి ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): నేడు లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లాయంత్రాంగం రంగం సిద్ధంచేసింది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి 39మంది బరిలో ఉన్నారు. ఎంపీగా పార్లమెంట్‌లోకి అడుగు పెట్టేదెవరు అన్నది నేడు తేలనుంది. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఓట్ల క్కింపు సందర్భంగా పటిష్టమైన భద్రత ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. భువనగిరి నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెం ట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితా లు నమోదు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశారు. హోం ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓటర్లను 14 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ చేయనున్నారు. ఒక టే బుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి అధికారి ఏఆర్వోగా ఉంటారు. 14 టేబుళ్లకు సంబంధించి ఏఆర్వోలు ఉంటారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతితో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ చేస్తారు.

కౌంటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు నియోజకవర్గ అబ్జర్వర్లు రాబర్ట్ క్షేత్రమాయామ్, ఎండీ ఎజ్బా హుస్సేన్ పర్యవేక్షిస్తారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బంది ప్రతి ఒక్కరికీ పాస్‌లు అందించారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉండగా, వారికి కూడా పాస్‌లు అందజేశారు. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ప్రవేశం ఉంటుంది. ఫలితాలు మధ్యాహ్నం తర్వాతే వెలువడనున్నాయి. జిల్లాలోని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 18,08,585 ఓటర్లు ఉండగా, 13,88,680 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 76.78 శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భువనగిరి లోక్‌సభ నుంచి 39మంది అభ్యర్థులు బరిలో నిలిస్తే, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), బూర నర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్) నడుమ ప్రధాన పోటీ నెలకొంది.

భువనగిరిలో మూడంచెల భద్రత

కౌంటింగ్ కోసం భువనగిరిలో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతీ స్ట్రాంగ్ రూం వద్ద సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందితోపాటు రాష్ట్ర సాయుధ సిబ్బంది, ఏఆర్ ఫోర్సు, సివిల్‌ఫోర్సు ఉంటుంది. స్పెషల్ ఫోర్సు కూడా ఉంటుంది. మొబైల్ ఫోన్లు, పేపర్లు, తదితర వస్తువులు కౌంటింగ్ హాల్లోకి అనుమతించబోరు. లెక్కింపు ప్రక్రియను సీసీటీవీ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్ పర్యవేక్షించనున్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు కేంద్రానికి చేరుకుంటుండడంతో పోలీసులు 200మీటర్ల అవతలే ఉండాలని సూచించారు.

భువనగిరి పార్లమెంట్	
భువనగిరి	19
ఆలేరు	20
మునుగోడు	18
తుంగతుర్తి	19
నకిరేకల్	23
జనగాం	20
ఇబ్రహీంపట్నం	18
మొత్తం రౌండ్లు	137

మొత్తం ఓట్లు	18,08,585
పోలైన ఓట్లు	13,88,680
పురుషులు	8,98,416
స్త్రీలు	6,86,003
పోలింగ్ శాతం	76.47
అభ్యర్థులు (బరిలో ఉన్న)	39

ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి




కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్‌రావు సూర్యవంశి అన్నారు. సోమవారం ఆయన కౌంటింగ్ ఎన్నికల పరిశీలకులు ఉపేంద్ర కుమార్‌తో కలిసి దుప్పలపల్లి గోదాంలో పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, అలాగే కౌంటింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

క్యాన్ బనేగా ఎంపీ?

- అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్స్‌తో నేతల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సారి ఎలాగైనా గట్టెక్కుదామని ఆశలు పెంచుకున్న నేతలకు అంచనాలు తారుమారు అవుతాయా? అనే అలజడి మొదలైంది. కౌన్ బనేగా భువనగిరి ఎంపీ అన్నది మంగళవారం మధ్యాహ్నం వరకు తేలనుంది. సార్వత్రిక ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకుని హ్యాట్రిక్ సాధించాలని ఎన్‌డీఏ... ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇండియా కూటమి, ఇతర పార్టీలు, స్వతంత్రులు హోరాహోరీగా పోటీపడ్డాయి. అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల శ్రేణులు ఎన్నికల్లో విజయం సాధించేందుకు 45రోజులపాటు తీవ్రంగా శ్రమించాయి. ఈ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఎవరికి పట్టం కడతారు? ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారు? ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తాయా? అన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేటితో అభ్యర్థుల్లో ఉత్కంఠకు తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికలకు కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సర్వం సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలకోసం పోటీలో ఉన్న అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇబ్రహీంపట్నం, జనగాం, భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి జరిగిన ఎన్నికలు మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలో పోటాపోటీగా పోరు సాగింది. రికార్డుస్థాయిలో పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో అత్యధికంగా 76.78శాతం ఓటింగ్ నమోదైంది. అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఓట్ల లెక్కింపు ఘడియలు రానే వచ్చాయి. దీంతో అభ్యర్థుల్లో మరింత హైటెన్షన్ ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు పోటాపోటీగానే ఉంటాయని సర్వేలు వెల్లడించడంతో స్వతంత్రులు, తిరుగుబాట్ల ఓట్లు చీలికపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. బీఆర్ఎస్, బీజేపీ ఒకవైపు, అధికార కాంగ్రెస్ మరోవైపు నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాల్లో ప్రచార హోరెత్తించాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అన్న ఆసక్తి రేపుతోంది. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రధాన పార్టీ శ్రేణులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఏ పార్టీకి మెజార్టీ లభిస్తుందోనని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో ఏ పార్టీకి అధికార పీఠం దక్కుతుందోనని ఆసక్తిగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఓటర్ల నాడి గుంభనంగా ఉండటంతో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారనే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. అభ్యర్థుల గెలుపోటములను తేల్చిచెప్పే సమయం ఆసన్నమైంది. మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసి అదే రోజు ఫలితాలు ప్రకటించడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గెలుస్తామా? ఓడిపోతామా.. అనేది స్పష్టత లేకపోవడంతో అందరిలోనూ ఫలితాల జ్వరం పట్టుకుంది. ఎవరికి వాళ్లు కూడికలు... తీసివేతల లెక్కల్లో మునిగితేలుతున్నా.. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో గెలుస్తామో అన్న ఆందోళన ప్రారంభమైంది.



ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాబర్ట్ సింగ్, ఎజ్బా హుస్సేన్

కలెక్టర్ భువనగిరి అర్బన్: భువనగిరి పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు జరిగినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నేడు నిర్వహించే ఓట్ల లెక్కింపు సిబ్బంది ఎన్నికల లెక్కింపు పరిశీలకులు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమాయామ్, ఎం.డీ ఎజ్బా హుస్సేన్ సమక్షంలో కేటాయించినట్లు చెప్పారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బందిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, డీఈవో కే.నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



వెబ్ఎక్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 3 : నకిలీ విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి వెబ్ఎక్స్‌వీడియోలో ఆయన మాట్లాడారు. మండల స్పెషల్ అధికారుల ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలు విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీలు చేయాలన్నారు.గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్‌శాఖ అధికారులతో టీం ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ గత సీజన్లలో నకిలీ విత్తనాలు విక్రయించిన వారిని విచారణ చేస్తూ నిఘా పెట్టాలని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై గట్టి నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి

కోదాడ రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించడంతో పాటు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం గుడిబండ రోడ్డులోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీచేశారు. మాధురి సీడ్స్, భవానీ సీడ్స్, సింధూర సీడ్స్ దుకాణాల్లోని విత్తనాలను తనిఖీ చేసి, మాట్లాడారు. రైతులకు ఏ పరిస్థితుల్లోనైనా నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు విక్రయించకూడదని సూచించారు. అధికారులు సీజన్ పూర్తయ్యేవరకు తనిఖీలు కొనసాగిస్తారని ఆయన అన్నారు. రిజిస్టర్‌లతో పాటు రికార్డులను తప్పకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కోదాడ సాంకేతిక వ్యవసాయ అధికారులు రాజు, దేవప్రసాద్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉండాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, జూన్ 3: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. అర్జీలపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ పరిధిలో ప్రతీ అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం ఐదు అర్జీలు అందాయని తెలిపారు.

లైంగికవేధింపుల కేసులో సస్పెన్షన్

- ప్రకటన విడుదల చేసిన కలెక్టర్

సూర్యాపేట టౌన్, జూన్ 3 : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కోదాడ మండలం కాపుగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి, జిల్లా అసంక్రమిత వ్యాధుల పర్యవేక్షణాధికారి, ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎస్ వెంకటరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కల్యాణ్‌చక్రవర్తిపై ఫిర్యాదు నేపథ్యంలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో పాటు ముగ్గురు అధికారులతో కూడిన కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే పలువురిని విచారించింది. కమిటీ రెండు దఫాలుగా నోటీసులు జారీ చేసినా కల్యాణ్‌చక్రవర్తి హాజరుకాలేదని కమిటీ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఫిర్యాదు రోజు నుంచే ఫోన్‌స్విచ్ఛాఫ్

లైంగికంగా వేధిస్తున్నాడని కల్యాణ్‌చక్రవర్తిపై ఆయన పర్యవేక్షించే ఆలన విభాగానికి చెందిన వైద్యురాలు ఆరోపణలు చేసింది. మే 28వ తేదీన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్ ఎస్పీ రాహుల్‌హెగ్డేకు ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం ఇటీవల ఏర్పాటుచేసిన ఆలన విభాగానికి కల్యాణ్‌చక్రవర్తి ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నాడు. అదేవిభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళ డాక్టర్‌ను పనిఒత్తిడికి గురిచేయడమే కాకుండా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె మే 20వ తేదీన మొదటగా డీఎంహెచ్‌వో కోటా చలంకకు ఫిర్యాదు చేసింది. అయితే ఆమె ఫిర్యాదుకు స్పందన లేకపోవడంతో తిరిగి మే 28వతేదీన ఎస్పీ రాహుల్‌హెడ్గేకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కల్యాణ్‌చక్రవర్తిపై కేసు నమోదుచేశారు. దీంతో కల్యాణ్‌చక్రవర్తి మే 30వ తేదీన 10 రోజులు సెలవు కావాలని శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కేసు నమోదైన విషయం తెలుసుకున్న కల్యాణ్‌చక్రవర్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేరు. సుమారు ఎనిమిది రోజుల తర్వాత వైద్యాధికారిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కల్యాణ్‌చక్రవర్తి లొంగిపోతారా? కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకుంటారా అన్న చర్చ సాగుతోంది. ఏదిఏమైనప్పటికీ వైద్యశాఖలో ఆయన వ్యవహారం చర్చనీయాంశమైంది.

చల్లబడిన వాతావరణం

- జిల్లాలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- రోహిణి కార్తెలో ఇదే అత్యల్పం

సూర్యాపేటటౌన్, జూన్ 3 : జిల్లాలో సోమవారం ఒక్కసారిగా ఉష్ణోగ్రత పడిపోయింది. ఆదివారం కురిసిన వర్షానికి తోడు ఎండవేడిమికి కూడా తగ్గడంతో చల్లని వాతావరణం నెలకొంది. జిల్లా సరాసరి ఉష్ణోగ్రత 37.0డిగ్రీలుగా నమోదైంది. అత్యధికంగా ఆత్మకూర్(ఎస్)లో 37.0డిగ్రీలు కాగా, మునగాలలో 36.8, మోతెలో 36.7, మట్టంపల్లిలో 36.4, మద్దిరాలలో 36.2, పాలకవీడులో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ఉష్ణోగ్రత 22.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇదిలా ఉండగా వారం రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంతో ఉపశమనం పొందారు. వర్షాలు పడుతుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా గత నెల 25న ప్రారంభమమైన రోహిణి కార్తె ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్తెలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా ముందస్తుగా నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడింది.


మహిళల చేతుల్లోనే సమాజ అభివృద్ధి



మాట్లాడుతున్న మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్

సూర్యాపేట టౌన్, జూన్ 3 : సమాజం అభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. సోమవారం సూర్యాపేటలో నిర్వహించిన ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రెండురోజుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వర్గ, కుల విభేదాలు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నాయని, వాటిని తరిమికొట్టాలంటే కేవలం మార్క్సిజమే సరైందన్నారు. ప్రతి ఒక్కరూ కుల, మత, రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. మహిళలు విద్యను సద్వినియోగం చేసుకోవాలని, విద్యతోనే మహిళా అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. ప్రపంచంలో అసమానతలు తొలగి సమసమాజం నిర్మాణం జరగాలన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ మహిళలకు సమాజంలో సరైన గుర్తింపు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు తమ హక్కులను ఎవరూ ఇవ్వరని, వాటిని సాధించుకునేలా పోరాటాలకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయకార్యదర్శి జయలక్ష్మి, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు చంద్ర అరుణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శిరోమణి, జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు ఝాన్సీ, కల్పన, లలిత, సంధ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 3 : కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ముగింపు సందర్భంగా జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేంధర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పటికే 10మంది ఆశావహులు ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో వేచిచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మాయమాటలతో, అసాధ్యపు 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే విఫలమైన ప్రభుత్వంగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఇందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే ఉదాహరణ అన్నారు. పట్టభద్రుదల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లవకుశ, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్, జీడి భిక్షం, రజాక్, సయ్యద్ సలీం, తాటికొండ సీతయ్య, పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్ నాయకులు పాల్గొన్నారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, జూన్ 3: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో 590 మంది విద్యార్థులకు గాను 532 విద్యార్థులు హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

నేడు, రేపు మద్యం దుకాణాలు బంద్

నల్లగొండ, జూన్ 3: పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా మందు దుకాణాలు బంద్ ఉండనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్

- నల్లగొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసి





కుటుంబరావు మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్‌ఐ లింగయ్య

చిట్యాలరూరల్, జూన్ 3: జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుం డ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ - 2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కైకలూరు మండలం భంజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమటి ప్రైవేట్ ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ అరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ అకస్మాత్తుగా వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. దీంతో బస్సు అదుపుకాక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటుగా డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. మృతుడు కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

'200 రోజులు ఉపాధి పని కల్పించాలి'

మాడ్గులపల్లి, జూన్ 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతీ కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మన్నెం భిక్షం, గండమల్ల రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీకి రూ.130, రూ.150 చెల్లిస్తే కుటుంబాలకు ఎలా పోషించుకుంటారని వారు ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గుంటోజు వెంకటాచారి, బొంగర్ల వెంకటయ్య, బొల్లెద్దు నాగయ్య, నగిరె కిష్టయ్య, వంశీ, కృష్ణ, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

50.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

● చల్లబడిన వాతావరణం ● పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి



నల్లగొండ, జూన్ 3: నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి మొదలైంది. చాలాచోట్ల విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30గంటల వరకు నల్లగొండ జిల్లాలో సగటున 50.2మి.మీల వర్షపాతం నమోదైంది. డివిజన్ల వారీగా పరిశీ లిస్తే దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా 621.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. డివిజన్‌లో అత్యధికంగా గుర్రంపోడు 115.2 మి.మీలు, కొండమల్లేపల్లి 102.8మి.మీలు, దేవరకొండలో 103.8మి.మీలు చందంపేటలో 94.1మి.మీలు, చింతపల్లిలో 93.3మి.మీలు, పీఏపల్లిల్లో 82.9 మి.మీల వర్షపాతం నమోదైంది. నాంపల్లిలో 58.8మి.మీలు, చండూరులో 57.1మి.మీలు, మునుగోడులో 43.8 మి.మీల వర్షం పడింది. అనుములలో 47.9 మి.మీలు, వేములపల్లిలో 64.1 మి.మీలు, మిర్యాలగూడలో 58.6మి.మీలు, దామచర్లలో 62.1మి.మీలు, పెద్దవూరలో 57.1మి.మీల వర్షం పడింది. శాలిగౌరారంలో 68.3మి.మీలు, కట్టంగూరులో 40.8మి.మీలు, నకిరేకల్ 47.8మి.మీలు, తిప్పర్తిలో 50.2మిమీలు, కనగల్‌లో 39.4మి.మీల వర్షం కురిసింది. వర్షం పడడంతో జిల్లాలో వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సోమ వారం నాడు గరిష్ట ఉష్ణోగ్రత 34.5డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. తీవ్ర ఎండలతో సతమతమైన ప్రజలు వాతావరణంలో మార్పులు రావడంతో జిల్లా ప్రజలు ఊరట చెందారు.


నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామంలో దుక్కి దున్ని పొలం సిద్ధం చేస్తున్న రైతు


భూమిని దున్నకానికి సిద్ధం చేస్తున్న వ్యవసాయ కూలీలు


ట్రాక్టర్లతో భూమి దున్నుతున్న రైతులు

తొలకరి పలకరించి..

తొలకరి పలకరించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. భూములను అరకలు, ట్రాక్టర్లతో చదును చేసుకొని దుక్కులు దున్నుతున్నారు. గతానికి భిన్నంగా నైరుతి రుతుపవనాలు పలకరించడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. మే నెలలో కురిసిన అకాల వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో సోమవారం నుంచే పల్లెల్లో సందడి మొదలైంది. విత్తనాలు చల్లడం ప్రారంభించారు.


స్టార్టర్ సరి చూసుకుంటూ..


విత్తనాలు నాటుతూ..


విత్తనాలు నాటుతున్న కూలీలు


పొలంలో ఎరువు సిద్ధం చేసుకొని.. భూమి దున్నుతూ..

హరిహరులకు విశేష పూజలు


ప్రధానాలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

● ప్రతిరోజూ 1000మందికి అన్నప్రసాద వితరణ

భువనగిరి అర్బన్, జూన్ 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాల యంలో సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభి షేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసా గాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటికమూర్తులను అర్చ కులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృ తాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగిం చారు. ఆలయ ఖజానాకు సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ. 28,80,593ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ సమయంలో నడక దారిలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈవో అడిగి తెలుసుకున్నారు. కొండ కింద సత్రంలో 600మందికి అన్నప్రసాదం అందజేస్తుండగా సోమవారం నుంచి 1000మందికి అన్నప్రసాదం అందజేసే కార్యక్రమాన్ని ఈవో భాస్కర్‌రావు ప్రారంభించి, భక్తులకు అన్నం వడ్డించారు. తూర్పు రాజగోపురం వద్ద కొనసాగుతున్న వీఐపీ (రూ. 150) ప్రత్యేక దర్శనం క్యూలైన్ పనులను ఆయన పరిశీలించారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిపల్లిలో సౌమ్య అంత్యక్రియలు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 3: అమెరికాలో గత నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడ్ల సౌమ్య అంత్యక్రియలు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిపల్లిలో ముగిశాయి. అమెరికాలోని తానా మహాసభ సభ్యులు, సౌమ్య బంధువుల సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సౌమ్య మృతదేహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు నివాళులర్పించారు.


సౌమ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న విప్ అయిలయ్య

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

నేరేడుచర్ల, జూన్ 3: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై(50) లైంగిక దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై అదే వీధికి చెందిన వానరాసి రాములు ఏడాది క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. కూలి పని చేసి జీవించే యడవెల్లి యాదగిరి నాలుగు రోజుల క్రితం ఆమెకు కూల్ డ్రింక్ తాపిస్తానని తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సోమవారం బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు. బాధిత దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త దూరంగా ఉండటంతో బాధితురాలు తండ్రి వద్దే ఉంటోంది.

ఒక్కరోజులోనే కేసు ఛేదించిన పోలీసులు

తుంగతుర్తి, జూన్ 3: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని ఓ ఇంట్లో ఆదివారం ఉదయం దొంగతనం జరిగింది. ఈ కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులోనే దొంగను అరెస్ట్ చేసి డబ్బులు రికవరీ చేశారు. సీఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దొంగలించారని తుంగతుర్తి మండల కేంద్రంలోని నార్లపురం శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి చుట్టు పక్కల ఇళ్లలోని సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించి దొంగతనం చేసిన అనుమానితుడిని మండలకేంద్రానికి చెందిన కల్లూరి సురేష్‌గా గుర్తించి ఇంటి వద్ద సోమవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా ఇంట్లో దొంగలించిన రూ.4లక్షల నగదు, మొబైల్ ఫోన్, మోటారు సైకిల్, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు ఏడుకొండలు, మధునాయుడు, ఏఎస్ఐ భగవాన్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుళ్లు సతీష్, విజయ్‌కుమార్ హోంగార్డు రవి, వెంకన్నను డీఎస్పీ అభినందించారు.

కుటుంబకలహాలతో..

కోదాడ, జూన్ 3: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్ఐ బి. శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన గాజుల రవి(36) ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య భువనేశ్వరి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి స్వగ్రామం బరాఖత్‌గూడెం వెళ్లింది. ఇంట్లో మద్యం తాగి లోపల గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం భార్య భర్తకు ఫోన్ చేస్తే ఎంతకు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి కోదాడకు వచ్చింది. బయట నుంచి తలుపులను కొట్టినప్పటికీ తీయకపోవడంతో ఇంటి పక్కవారిని పిలిపించి తలుపులు తెరిచి చూశారు. అప్పటికే రవి మృతిచెంది ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


నల్లగొండ జిల్లాకేంద్రం శివారు దుప్పలపల్లి సమీపంలో లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

లెక్కింపునకు సర్వం సిద్ధం

నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. భువనగిరి లోక్‌సభకు సంబంధించి భువనగిరిలోని అరోరా కాలేజీ ప్రాంగణంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు దాసరి హరిచందన, హనుమంతు కే.జెండగే నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది.


నల్లగొండలోని సమాచార కేంద్రం


భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర


నల్లగొండలో ఏర్పాటు చేసిన టేబుళ్లు


నల్లగొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు


భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ జెండగే


భువనగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్


భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లు

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూన్ 3: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో సోమవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యుల ఆధ్వర్యంలో జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గురడోత్సవనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్,పాల్గొన్నారు.

6,7 తేదీల్లో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

తుంగతుర్తి, జూన్ 3: తుంగతుర్తిలో ఈ నెల 6,7తేదీల్లో నిర్వహించే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతంచేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట గోపీ కోరారు. సోమవారం తుంగతుర్తిలో ఈ శిక్షణా తరగతుల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంపై పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు 200మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, తాటి విజయమ్మ, అంతయ్య, దేవరాజ్, ముత్తయ్య, సోమయ్య పాల్గొన్నారు.

అందుబాటులో తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ వరి విత్తనాలు

నాగారం, జూన్ 3: తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సర్టిఫైడ్ వరి విత్తనాలు నాగారం ఎక్స్ రోడ్డులో ఉన్న గ్రామీణ ఆగ్రో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లో ఉన్న సేల్ కౌంటరులో అందుబాటులో ఉన్నాయని ఎఫ్‌పీసీ ఎండీ కొడవకంటి వెంకన్న సోమవారం తెలిపారు. బీపీటీ 5204 వరి సన్న రకం 25కిలోల బ్యాగు ధర రూ.1030, కేఎన్ఎం1638 సన్నరకం బ్యాగు ధర రూ.1030, దొడ్డు రకాలు ఎంటీయూ 1010 బ్యాగు ధర రూ. 988, కేఎన్ఎం 118 బ్యాగు ధర రూ. 988లు ఉందన్నారు. నాణ్యమైన వరి విత్తనాలు కావల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కోసం సెల్ నెం.9182305338, 9398502513లను సంప్రదించాలని కోరారు.

'దాడి చేసిన వారిని శిక్షించాలి'

అనంతగిరి, జూన్ 3: తనపై దాడి చేసిన వారిని శిక్షించాలని మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన గుగులోతు సైదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని వేపలకుంట చెరువులో బాణోతు బాబు ఆయన అనుచరులు ఎటువంటి అనుమతులు లేకుండా రెండు రోజుల నుంచి చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు తనపై దాడి చేసి గాయపర్చారని, నిందితులపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

భారీ వర్షంతో ప్రజలకు ఊరట

కోదాడ రూరల్, జూన్ 3: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ప్రజలు కొంత ఊరట చెందారు. ఇప్పటివరకు తీవ్రమైన ఉక్కపోత, ఎండలతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని రెడ్లకుంట, నల్లబండగూడెం, కూచిపూడి, దోరకుంట, తొగర్రాయి, గణపవరం, యర్రవరం గ్రామాల్లో రెండు గంటలకుపైగా వర్షం కురిసిందని, ఆయా గ్రామాల రైతులు తెలిపారు. ఈ వర్షం వ్యవసాయ పనులకు అనువుగా ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదివారం రాత్రి మండలంలో కురిసిన భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని 16 గ్రామాల్లో రాత్రి 9.30 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో జాగారం చేయాల్సి వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. అనంతగిరి మండలంలో కూడా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని స్థానికులు తెలిపారు.

ఎన్నికల ఫలితాల వీక్షణకు ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

కోదాడ రూరల్, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సాయిగౌడ్ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవాదళ్ మండల అధ్యక్షుడిగా గిరిబాబు

అర్వపల్లి, జూన్ 3: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన బుర్ర గిరిబాబును నియమించారు. ఈ మేరకు గిరిబాబుకు నియామకపత్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచార్యులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

మఠంపల్లి, జూన్ 3: రైతులు వ్యవసాయ విద్యుత్ మోటర్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. రైతులు నరసింహారెడ్డి, పుల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం గ్రామ శివారులో రైతులు ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. 15 రోజుల క్రితం గ్రామశివారులోని ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి విలువైన సామగ్రిని చోరీ చేశారని తెలిపారు. పోలీసులు గ్రామాల్లో రాత్రి వేళ్లలో గస్తీ నిర్వహించాలని, నిందితులను పట్టుకోవాలని రైతులు కోరారు.

గూడ్స్‌రైలు ఢీకొని రెండు గేదెలు మృతి

మఠంపల్లి, జూన్ 3: గూడ్స్ రైలు ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. సోమవారం మఠంపల్లి కేంద్రంలో ఈ ఘటన జరిగింది. మఠంపల్లికి చెందిన రైతు ఆకుల రమేష్ పెంచుతున్న గేదెలను సోమవారం మేతకు వదిలాడు. గ్రామ శివారులో మేస్తున్న క్రమంలో గేదెలు పట్టాలు దాటుతూ మఠంపల్లి నుంచి జగ్గయ్యపేట వైపు వెళుతున్న గూడ్స్ రైలు ఢీకొని మృతిచెందాయి. ఉదయం 8.30గంటల సమయంలో అటుగా వెళ్లిన యువకులు గుర్తించి రైతుకు సమాచారమిచ్చారు. అదే సమయంలో అటుగా ఓ గూడ్స్ రైలు రావటంతో పట్టాలపై ఉన్న గేదె కళేబరాన్ని తొలగించారు. మృతిచెందిన గేదెల విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రమేష్ కోరారు.

విద్యుదాఘాతంతో గేదె..

చిలుకూరు, జూన్ 3: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గుండు లక్ష్మయ్యకు చెందిన పాడి గేదె సోమవారం మేత కోసం పొలాల్లోకి వెళ్ళింది. ఆ సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన పాడి గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోదాడ, జూన్ 3: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం కోదాడలో లభ్యమైంది. పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డితెలిపిన వివరాల ప్రకారం.. కోదాడలోని అయ్యప్పస్వామి గుడికి సమీపంలో ఖాళీ స్థలంలో సుమారు 40నుంచి 45 సంవత్సరాలు వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుళ్లి పోయే స్థితిలో ఉన్న మృతదేహాన్ని మునిసిపల్ సిబ్బంది కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దొంగలు ధ్వంసం చేసిన హుండీ

దేవాలయంలో చోరీ

పెన్‌పహాడ్, జూన్ 3: మండలంలోని నాగులపహాడ్ గ్రామంలోని గంగదేవర దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దేవాలయ నిర్వాహకులు సుంకరబోయిన వెంకన్నయాదవ్, సతీష్‌యాదవ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవాలయం గేటు తాళాన్ని ధ్వంసం చేసిన దొంగలు లోపలికి ప్రవేశించిన దొంగలు గుడి గంటలు చోరీ చేయడంతో పాటు హుండీని ధ్వంసం చేసి సుమారు రూ.10వేలను చోరీ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కోదాడ, జూన్ 3: పాలిసెట్ ఫలితాల్లో కోదాడ పట్టణానికి చెందిన నూనె మణదీప్ రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు, గంథం స్రవంతి 617వ ర్యాంకు సాధించినట్లు ఆస్క్ నిర్వాహకుడు మాతంగి ప్రభాకర్ తెలిపారు. సోమవారం కోదాడలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బల్గూరి దుర్గయ్య, వెంకటరత్నం, రమేష్, బుచ్చారావు, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామం



గోరెంట్ల గ్రామానికి దూరంగా ఉన్న వైకుంఠధామం, ఎగిరిపోయిన గదుల పైకప్పు రేకులు

మద్దిరాల, జూన్ 3: లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. ఊరికి దూరంగా ఉండటం, కనీసవసతులు లేకపోవడంతో ప్రజలు వినియోగించటంలేదు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలను స్థానిక చెరువు సమీపంలోనే పూర్తి చేస్తున్నారు. గత ప్రభుత్వం 2017-18 సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించింది. మొదటి విడతలో మండలంలోని గోరెంట్ల గ్రామానికి కిలోమీటరు దూరంలో రూ.8 లక్షలతో ఉపాధిహామీ కింద నిర్మించారు. అంత్యక్రియలకు రెండు వేదికలతో పాటు ఉత్తర క్రియల కోసం రెండు గదులను పైకప్పు రేకులతో ఏర్పాటు చేశారు. నాణ్యత లోపంతో కొద్దికాలానికే రేకులు ఎగిపోయాయి. వాటిని ఏర్పాటు చేసే నాథుడే కరువయ్యాడు. నీటి వసతితో పాటు కరెంట్ సౌకర్యం కూడా లేదు. దీంతో అంత్యక్రియలను స్థానిక చెరువు సమీపంలో, కొందరు వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైకుంఠధామం నిర్వహణ బాధ్యత పంచాయతీ అధికారులు చూసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ఇన్‌చార్జి పీఆర్ ఏఈ లావణ్యను వివరణ కోరగా గతంలో నిర్మించారు. ఈమధ్య కాలంలోనే బాధ్యతలు స్వీకరించాను, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

తిరుమలగిరి, హుజూర్‌నగర్, తుంగతుర్తి, జూన్3: ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్కే గౌస్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు విత్తన డీలర్లు స్టాక్ బోర్డు, ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు ఉన్నారు

● రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ చరమందరాజు హెచ్చరించారు. హుజూర్‌నగర్‌లో పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలనే రైతులకు అందించాలన్నారు. ఎక్కువ ధరకు విక్రయించినా, విత్తనాలకు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ సంధ్యారాణి, ఎస్ఐ ముత్తయ్య, ఏవో స్వర్ణ పాల్గొన్నారు.

తుంగతుర్తి: రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ డి.శ్రీనునాయక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా విత్తనాలను విక్రయిస్తుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్ఐ ఏడుకొండలు, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మీప్రసన్న, విత్తనాలు, ఎరువుల దుకాణాలు డీలర్లు అధ్యక్షుడు పైసపల్లి యాదగిరి, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మహిళా చట్టాలు సమర్థంగా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి

హుజూర్‌నగర్, జూన్ 3: మహిళా చట్టాలను సమర్థంగా అమలుచేయాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి మల్లేశ్వరి కోరారు. మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మహిళా సమాఖ్య ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. మహిళా చట్టాలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. విద్యా, ఉపాధి, ఆహార భద్రత, ఆరోగ్యం, సామాజిక భద్రత కోసం పాటుపడాలన్నారు. మహిళలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పశ్య పిచ్చమ్మ సుజాత, పద్మ, పుష్ప, రామనర్సమ్మ, మంగమ్మ, ఫాతిమ, లింగమ్మ, పుల్లమ్మ, వీరమ్మ, జానీబీ, వెంకటమ్మ, సంధ్య పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మహిళా సమస్యలపై మహిళా సమాఖ్య నిరంతరం ఉద్యమాలు చేస్తున్నట్లు జిల్లా మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి అన్నారు. జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె జెండా ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకురాలు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, అరుణ, సైదమ్మ, ఆశా బేగం, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన లింగమంతుల సౌడమ్మ జాతర

పెన్‌పహాడ్, జూన్ 3: మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో సోమవారం లింగమంతుల సౌడమ్మ జాతర ప్రారంభమైంది. యాదవ కులస్థులకు చెందిన మహిళలు గంపలు. బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఐఏసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి అడ్డి కేశవులు,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ముత్తినేని శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు దూబని లింగయ్య. రామదండు సైదులు, మున్న లింగయ్య. వీరబోయిన రవి, దూబని నాగయ్య, పేర్ల నాగయ్య, కలంచర్ల సౌడయ్య, రాజు, లింగయ్య, మున్న బిక్షం, కొండ బిక్షం, శేఖర్, వెంకన్న పాల్గొన్నారు.



దేవాలయంలో పూజల్లో పాల్గొన్న రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి



జాతరకు హాజరైన భక్తులు

వైభవంగా గంగమ్మ జాతర..

కోదాడ రూరల్: మండలంలోని రెడ్లకుంట గ్రామంలో గంగమ్మ జాతరను సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి సంవత్సరం వానాకాలం సీజన్‌కు ముందు గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్థులు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలోట ఆలయానికి తరలివచ్చి ఈ సంవత్సరం పంటలు బాగా పండి తమ ఆశలు నెరవేరాలని కోరుకుంటూ గంగమ్మకు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ సాతినేని లీలాఅప్పారావు, మల్లెల పుల్లయ్య, గన్నవరపు లక్ష్మణ్‌రావు, కనగాల నాగేశ్వరరావు, నారదాసు ముత్తయ్యతో పాటు పలువురు యాదవ కులస్థులు పాల్గొన్నారు.

చైన్ సిస్టంతో రూ.లక్షల్లో మోసం



● రూ.15 వేలు కడితే ఎలక్ట్రికల్ స్కూటర్ ఇస్తామని వల

● ఒకేగ్రామంలో 250మంది బాధితులు

గరిడేపల్లి, జూన్ 3: అమాయకులే లక్ష్యంగా ఓ ముఠా లక్షల రూపాయల మోసానికి పాల్పడింది. చైన్ సిస్టంతో వందలాది మందిని బురిడీ కొట్టించింది. గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో ఎంతో మంది బాధితులు ఈ ఉచ్చులో చిక్కారు. ఎస్ఎస్ ఏకో అనే సంస్థ నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట మండలాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసింది. ఈ సంస్థలో ఒకరు రూ.15వేలు చెల్లించి చేరాలని, ఆ వ్యక్తి మరో ఎనిమిది మందిని సభ్యులుగా చేర్పిస్తే ఎలక్ట్రికల్ స్కూటర్ ఇస్తామని. ఒక వేళా ఎనిమిది మంది సభ్యులను చేర్పించలేనట్లయితే రూ.15వేల విలువైన ఫ్రిడ్జ్, కూలర్ వంటి వస్తువులు ఇస్తామని నమ్మబలికింది. డబ్బు చెల్లించి సభ్యుడిగా చేరగానే ఆ సభ్యుడి పేరిట ఒక ఐడీ కార్డును కూడా ఇచ్చింది. రూ.15వేలు తీసుకున్నట్లు ఎలాంటి రసీదు ఇవ్వడం ఇవ్వడం లేదు.

పేదలే లక్ష్యం..

టీం లీడర్లను నియమించి గ్రామాల్లో కూలి, నాలి చేసుకునే వారినే లక్ష్యం చేసుకుంది. ఈ స్కీం గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో ఉంది.. గరిడేపల్లి మండలంలోని ఒక గ్రామంలో 250మంది ఒక్కొక్కరు రూ.15వేలు చెల్లించి మోసపోయినటు సమాచారం. ఆ గ్రామంలో ఎనిమిది మందికి ఎలక్ట్రికల్ స్కూటర్లు ఇవ్వడంతో అందరికీ వస్తాయని 250 మంది సభ్యులుగా చేరినట్లు స్థానికులు తెలిఆపరు. ఈ చైన్ సిస్టంలో ఎనిమిది మందిని చేర్పించే క్రమంలో సభ్యులు కొందరు నలుగురిని, మరికొందరు ముగ్గురిని, ఇంకొందరు ఇద్దరిని చేర్పించడంతో బాధితులు మొత్తం 250 మందికి చేరారు. సభ్యులుగా చేరినవారు ఎనిమిది మంది సభ్యులను చేర్పించలేక పోవడంతో వారికి ఎలక్ట్రిక్ స్కూటర్ రాలేదు. దీంతో రూ.15వేలకు సరిపడా కూపన్ ఎప్పుడు ఇస్తారని ఎదురు చూస్తున్నారు. దీంతో తమను ఈ స్కీంలో చేర్పించిన వారిపై ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై సంస్థ నుంచి సరైన సమాధానం రాలేదని తెలిసింది. . ఈ చైన్ సిస్టం మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నా రు.



స్కీంలో చేరిన వారికి అందజేసిన ఐడీ కార్డు

ఫిర్యాదు అందలేదు

ఈ చైన్ సిస్టంపై ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఫిర్యాదు చేస్తే మోసాలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.. ఇలాంటి బోగస్ స్కీంలకు ఎవరూ ఆకర్షితులు కావొద్దు. రూ.15వేలకు స్కూటర్ వస్తుందని ప్రజలు ఆశపడి మోసపోవొద్దు.

● చరమందరాజు, సీఐ, హుజూర్‌నగర్

'ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి'

హుజూర్‌నగర్, జూన్ 3: చెరువు భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని చెరువుల పరిరక్షణ కమిటీ నాయకుడు ముల్కలపల్లి సీతయ్య, కౌన్సిలర్లు అమరబోయిన సతీష్, రామ్‌గోపీ కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పట్టణంలోని పోతిరేనికుంట, అలకశంకరకుంట, బట్టవానికుంట భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. చెరువులపై ఎన్నో మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. హుజూర్‌నగర్ ముత్యాలమ్మ చెరువుకు సంబంధించి 400మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. వారి కుటుంబాలకు అన్యాయం జరుగుతోందన్నారు. కొంతమంది సొసైటీ సభ్యుల సహకారంతో చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలన్నారు. సమావేశంలో ముల్కపల్లి రాంబాబు, గోపి, రామ్మూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

కోదాడ టౌన్, జూన్ 3: కౌండిన్య గౌడ సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడిగా కోదాడకు చెందిన గాలి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు శ్రీనివాస్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని ఆ సంఘ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ప్రభుత్వంనుంచి గౌడ కులస్థులకు అందాల్సిన సహాయ సహకారాల కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పుట్ట వెంకటేష్, అరవింద్, పాపారావు, సాంబయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య మృతి టీడీపీకి తీరని లోటు



నాగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోషపతి

హుజూర్‌నగర్, జూన్ 3: టీడీపీ నాయకుడు జడ నాగయ్య మృతి పార్టీకి తీరని లోటని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శీతల రోషపతి అన్నారు. సోమవారం మండలంలోని మగ్దూంనగర్‌లో నాగయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక కార్యక్రమాలలో నాగయ్య పాల్గొన్నాడని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాలువపల్లి బ్రహ్మారెడ్డి, జడ కృష్ణ, లచ్చిరెడ్డి, నాగయ్య, రమాదేవి, రాజేష్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

7న ఆలయ భూముల కౌలు వేలం

నాగారం, జూన్ 3: మండలంలోని ఫణిగిరి గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి డి.కొత్తపల్లి, చెన్నాపురం, ఫణిగిరి, మామిడిపల్లి గ్రామాల్లో ఉన్న 105ఎకరాల కౌలుకు ఆలయ ప్రాంగణంలో ఈ నెల ఏడో తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, ఈవో వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల ఏడో తేదీ లోపు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు. విజేతలైన రైతులు 3/4వంతు డబ్బును వెంటనే చెల్లించాలని, మిగిలిన డబ్బును 90రోజుల్లో చెల్లించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

నేరేడుచర్ల, జూన్ 3: మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మేడిపల్లి కృష్ణయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కృష్ణయ్య కుటుంబానికి బీఆర్ఎస్ నుంచి మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును సోమవారం సూర్యాపేటలో జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, చెన్నబోయిన సైదులు, జయబాబు, లింగయ్య , అనంతు శ్రీను, సుదర్శన్, గురవయ్య, హరీష్, ఉపేందర్, రవీందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



అమ్మక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, జూన్ 3: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన మారగాని అమ్మక్క సోమవారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యలను ఎమ్మెల్యే సామేలు పరామర్శించి, అమ్మక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

నూతన్‌కల్: ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి మామ కాంగ్రెస్ నాయకుడు భూరెడ్డి పుల్లారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో పుల్లారెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను సామేలు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జడ్పీటీసీ కందాళ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణశ్రీ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నూతన్‌కల్, జూన్ 3: ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడటంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన అనంతుల లింగయ్య సోమవారం కల్లుగీయడానికి గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. లింగయ్యను సమీపంలోని రైతులు సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ దుకాణం తనిఖీ

నూతన్‌కల్, జూన్ 3: మండలంలోని ఎడవెల్లి గ్రామ రేషన్ దుకాణాన్ని తుంగతుర్తి డీటీసీఎస్ విజయ్‌శేఖర్ సోమ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్‌వో ఆదేశాల మేరకు తనిఖీ చేశామన్నారు. మంగళవారం కూడా దుకాణంలో తనిఖీలు నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజయ్‌శేఖర్